పెట్టుకోవాలన్న యోచన కలిగింది.

ముద్దు కేవలం మనిషికే పరిమితం కాదు. జూదగాళ్ళు అదృష్టం తమని వరించాలని డైస్‌ని, కొందరు మనుషులు ఆ విధంగా లాటరీ టికెట్లని, ఐర్లండ్‌లోని బ్లార్నిస్టోన్ని సందర్శకులు (కారణం తమలో మాటకారితనం ఆ ముద్దువల్ల పెరుగుతుందన్న మూఢనమ్మకం) చిన్నపిల్లలు బొమ్మలని, పెంపుడు జంతువులని, రోమన్ కేథలిక్స్ రుద్రాక్షలని, బిషప్స్ వుంగరాన్ని, యూదులు ప్రేయర్‌షాల్స్‌ని, విమాన ప్రయాణం అంటే భయపడేవారు, లేదా చలాకాలం తర్వాత స్వదేశం తిరిగివచ్చే దేశభక్తులు విమానం దిగగానే భూమిని, చిన్నపిల్లలు తొక్కుడుబిళ్ళఆట ఆడేప్పుడు గడిలోకి విసరబోయే రాయిని ముద్దు పెట్టుకుంటారు.

ముద్దుకే ముద్దొచ్చే ముద్దుని ఓ ముద్దుగుమ్మకి ప్రతిరాత్రి పెడుతుంటే పూర్ణాయుష్షుగా జీవించవచ్చు.

# సినిమాకి కథ

సినిమా వాళ్ళకి ఒకోసారి ఒకోసీజను. మూగ మనసులు హిట్ అవడంతో మనుసులు కాని మనసులు చాలా వచ్చాయి. అలాగే అన్నా చెల్లెళ్ళ అనుబంధం మధ్య పాటలు కొన్ని సినిమాల్లో వరసగా వచ్చాయి. జ్యోతి లక్ష్మి డాన్సులేని సినిమాలు అపుడు వుండేవి కావు. ఓ సినిమాలో విజయవంతం అయే ప్రతి అంశానికి ఓ సీజనుని సృష్టిస్తుంటారు సినిమా వాళ్ళు.

అలాగే ఆ మధ్య తెలుగు నవలలు సినిమాలుగా రావడం సీజనయింది. 'మద్రాసు వుచితంగా వెళ్ళి రావాలంటే, సినిమాకి పనికొచ్చే ఓ నవల రాయడమే మంచి మందా' అన్నట్లుగా అయిపోయారు. ఆ కోవలోనే ఆ మధ్య ఓ నిర్మాత నాకు ఫోన్ చేసాడు,

"ఇక్కడికి షూటింగ్ పనిమీద వచ్చాం. వారం రోజులుంటాం. తర్వాత పిక్చర్‌కి మంచి కథకావాలి. మీ దగ్గర వెరైటీ సబ్‌జెక్ట్స్ ఏమైనా వుంటే చెప్పండి" అన్నాడాయన.

ఆ రాత్రి ఆయన హోటల్ గదికి వెళ్ళాను. షూటింగ్‌తో అలసి పోయిన నిర్మాత, దర్శకులు శుభ్రంగా స్నానం చేసి గ్లాస్కో లాల్చి, పంచె కట్టుకుని మంచం మీద బాసింపట్టు వేసుకుని కూర్చున్నారు.

"మీ దగ్గర సబ్‌జెక్ట్సేమైనా వున్నాయా?" అడిగాడు నిర్మాత.

"ఉన్నాయండి. ఏ సబ్‌జెక్ట్ కావాలంటే అదుంది. ఫిజికల్ సైన్స్ మీద 'కొత్త శత్రువు' రాసాను. జువాలజీ సబ్‌జెక్ట్ మీద 'నత్తలొస్తున్నాయి జాగ్రత్త' అనే నవల రాశాను. సైకాలజీ మీద 'మిష్టర్ సంపత్' రాసాను. ప్రస్తుతం ఏరో డైనమిక్స్ మీద 'ఎయిర్ హోస్టెస్' అనే నవల రాస్తున్నాను. మేథమేటిక్స్ మీద..."

"సబ్‌జెక్ట్స్ అంటే అవికావు. కథలు" చెప్పాడు దర్శకుడు నా వాగ్ధాటికి అడ్డుపడి.

"అలాగా? ఉన్నాయండి."

బ్రహ్మానందం, అర్జున్‌కి సరిపడే సబ్‌జెక్ట్....అదే.... కథ కావాలి. వచ్చేనెలే షూటింగ్...."

నవలల కట్ట దర్శకుడికి ఇచ్చాను.

"మీరే ఎన్నిక చేసుకోండి."

ఆ కట్టవంక నిరుత్సాహంగా చూసి చెప్పాడు.

"ఇవి చదివే తీరికెక్కడుందండి."

"నాకు రాయడం తప్ప చెప్పటం అంతగా రాదండి. మొత్తం నవలుందిగా. ఇంక చెప్పటం దేనికి? చదవచ్చుగా?"

"చదవటం అలవాటు లేదండి" చెప్పాడు నిర్మాత.

లక్షలు పెట్టి తీసే సినిమాకి కథ ముఖ్యమయినపుడు, పనికొస్తుందా లేదా అని నిర్ణయించడానికి, మంచిదేదో కనుక్కోడానికి పుస్తకాలు చదవడం కుదరదు అంటే నాకు ఆశ్చర్యం వేసింది.

"మీరు చెప్పిన ఆర్టిస్ట్‌లకి సరిపడే కథ లేదు."

నిరుత్సాహంగా చూసారు నావంక.

"పోనీ కొత్తది తయారు చేస్తారా?" అడిగాడు నిర్మాత.

"ఆ పని చెయ్యండి. మీకు తెలుసుగా బ్రహ్మానందం ఎలాంటి కేరక్టర్స్ వేస్తుంటారో. అర్జున్ ఫైట్స్ బాగా చేస్తాడు. అది దృష్టిలో వుంచుకుని కథ చెప్పండి."

"కథ చెప్పడం కంటే రాసి తీసుకురావడమే నాకు తేలికండి" చెప్పాను.

"మీరు క్లుప్తంగా రాసి తీసుకురండి. మా అసిస్టెంట్ చదివి మాకు చెప్తాడు" చెప్పాడు దర్శకుడు.

'ఈయన మెదడుకి కంటి కన్నా చెవినించే దగ్గర దారిలా వుంది' మనసులో అనుకున్నాను.

నాలుగు రోజుల తర్వాత కలవాలని నిర్ణయించుకున్నాం. నవల రాయడానికి అధికంగా కృషి చేయాలి, ఏదో ఓ కొత్త సబ్జెక్ట్‌కి సంబంధించి రాస్తుంటాను కాబట్టి. సినిమాలకి అలా కృషి చేయటంలో తప్పులేదని బ్రహ్మానందం నటించిన చిత్రాల కాసెట్స్ అరడజను, వేలు నటించినవి ఓ అరడజను, అర్జున్ నటించినవి ఓ అరడజను తెప్పించి వాటిని చూసాను. నాకు ఓ అవగాహన ఏర్పడింది ఆ సినిమా కథ ఎలా వుండాలో.

అరడజను తెల్ల కాగితాలమీద కథ సినాప్సిస్ తయారు చేసి పట్టుకెళ్ళాను. ఎప్పటిలా మంచం మీద బాసింపట్టులో కూర్చుని వున్నారు ఇద్దరు.

"మీరు రాసింది చదవండి. చెప్పక్కర్లేదు" చెప్పాడు నిర్మాత.

దర్శకుడు సిగరెట్ వెలిగించి చదవమన్నట్లుగా నా వంక చూసాడు.

గొంతు సర్దుకుని చదవ సాగాను.

"రాజశేఖర్ రైలు లేటయిందేమో కనుక్కోడానికి రైల్వే స్టేషన్కి ఫోన్ చేసాడు. ఎంగేజ్డ్ శబ్దం వచ్చింది. కాసేపాగి మళ్ళీ ఫోన్ చేసాడు. ఈసారి కూడా ఎంగేజ్డ్. మూడోసారి అవతలవైపు ఎత్తారు. "హలో....

ఏలూరు వెళ్ళే బండి లేటుందాండీ?'' అడిగాడు రాజశేఖర్. అవతలి వైపు నుంచి జవాబు లేదు. 'హాలో....హాలో' అరిచాడు రాజశేఖర్. ఫోన్ తీసి పక్కన పెట్టారని గ్రహించి ఎంక్వయిరీ కౌంటర్‌లోని వ్యక్తిని తిట్టుకున్నాడు. టయిమవుతోందని సూట్ కేసుతో బస్‌స్టాప్‌కి చేరుకున్నాడు. మొదటి రెండు బస్సులు స్టాపులో అగలేదు. స్టాప్ దాటి అపారు. వాటి దగ్గరకి పరుగెత్తాడు గాని, రాజశేఖర్ చేరుకునేలోగానే అది కదిలి వెళ్ళిపోయింది. మూడో బస్సులో చివరికి ఎట్లాగో ఎక్కాడు. కిటకిట లాడుతోంది. సూట్‌కేస్ ఎవరికో తగిలితే 'కళ్ళులేవా' అని తిట్టాడాయన. రాజశేఖర్ 'వుంటే చూసుకుని తప్పుకోరాదు' అన్నాడు. ఇద్దరు పోట్లాడుకుంటుంటే కండక్టర్ సర్ది చెప్పాడు. తర్వాతి బస్ స్టాప్‌లో రాజశేఖర్‌కి సీట్ దొరికింది. బస్‌దిగి రైల్వే స్టేషన్‌లోకి అడుగు పెట్టాడు. ఏలూరు వెళ్ళే బండి కిటకిటలాడుతోంది. రాజశేఖర్ సీట్లో ఎవరో కూర్చుని వున్నారు. అతనికీ అదే నంబరు సీట్ అలాటయి వుంది. అది రైల్వే రిజర్వేషన్ క్లర్క్ చేసిన పొరబాటు అని గ్రహించాడు.

"ఆగండి'' చెప్పాడు దర్శకుడు.

ఆగాను.

"మీకు సినిమా స్క్రిప్ట్‌లతో పరిచయం లేదనుకుంటాను?''

"లేదండి. ఏం?"

"ఇందాక రైల్వే స్టేషన్‌కి రాజశేఖర్ ఫోన్ చేసాడన్నారు. మొదటి సారి రింగ్ చేయగానే సమాధానం రావాలి. రెండు మూడుసార్లు ఫోన్ చేయడం దేనికి? అసలు డైరెక్టరీ చూడటం దేనికి?'

"మీరెప్పుడూ రైల్వే ఎంక్వయిరీకి ఫోన్ చేసినట్లు లేదు. మొదటి సారి రింగయి ఎత్తితే అది ఎనిమిదో వింతవుతుంది ప్రపంచంలో. తర్వాత రైల్వే ఎంక్వయిరీ నంబర్ బట్టీ కాదు కదా రాజశేఖర్‌కి. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు చూసుకోడానికేగా డైరెక్టరీ?"

"బోల్డంత ఫుటేజ్ వేస్టవుతుంది సహజత్వానికి పోతే. మీరు చూస్తూనే వుంటారు. సినిమాల్లో ఏ పాత్ర ఫోన్ చేసినా ఎప్పుడు అవతలివైపు రింగయి ఎత్తుతారు కాని ఎంగేజ్ వచ్చి రెండు మూడు

సార్లు ట్రయ్ చెయ్యరు. అలాగే బస్సు స్టాప్‌లో రెండు బస్సులు అగక పోవడం, రాజశేఖర్ పెట్టె పట్టుకుని పరిగెత్తడం తీసెయ్యాలి."

"మీరు మావూళ్ళో రేపు ఉదయం తొమ్మిది నుంచి పదింపావు దాకా అయిదో నంబరు బస్సు స్టాప్ దగ్గర నిల్చుని చూడండి. నే రాసిందాంట్లో అబద్ధం వుందేమో తెలుస్తుంది."

"అలాగే బస్సులో ఎక్కగానే ఖాళీ సీటు వుంటే అందులో కూర్చోవాలి కాని హీరో కాబట్టి నిలబడి ప్రయాణం చేయకూడదు. రైల్లో ఒకే సీటుని ఇద్దరికి రైల్వే క్లర్క్ పొరబాటున రిజర్వ్ చేసే అవకాశం వున్నా అది కూడా వుండకూడదు. ఠక ఠక ఠక వెళ్ళిపోవాలి కథ."

"కాని ప్రతి మధ్య తరగతి కథానాయకుడు జీవితంలో అతను రోజూ జరిగే వీటిని తిట్టుకుంటూంటాడు కదండి. అతని జీవితం ఠక ఠక ఠక సినిమా కథలా సాగిపోవటం లేదుగా? అందుకే ఇలా రాసాను. అసలిలా మీరు చెప్పినట్లు జరగడం వూహించడమే కష్టం. ఆ మంచి రోజులు ఎప్పుడు వస్తాయో?"

నిర్మాత చిన్నగా ఆవులించి చెప్పాడు.

"మిమ్మల్ని మరోసారి కలుస్తాను. రేపు ఉదయం షూటింగ్ గురించి మాట్లాడుకోవాలి."

వెళ్ళిరండి అని సున్నితంగా చెప్పడంతో బయటకి నడిచాను.

రిక్షా లాక్కునే హీరో ఇస్త్రీ పేంట్, షర్ట్‌లు వేసుకోవడం, ఫైటింగ్ సీన్‌లో హీరో చొక్కా చిరగకపోగా, మడతకూడా నలగక వడం, అతడు పదిమందిని నేల కరిపించడం విలన్‌లు ఎప్పుడూ తాగుతుంటడం, హీరో, హీరోయిన్స్ పరిచయం ఎప్పుడూ పోట్లాటతో మొదలయి చివరికి ప్రేమలోకి దిగడం, హాస్యగాడెపుడూ మినిమం ఐ.క్యూ. కూడా లేని మనిషి సర్కస్ బఫూన్ చేసే తెలివి తక్కువ పనులు చేస్తుండటం మొదలయిన సీన్స్ వున్న తెలుగు సినిమాల గురించి ఎవరయినా కామెంట్ చేస్తూంటే నాకా నిర్మాత, దర్శకులే గుర్తొస్తుంటారు.